క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి సన్మానం



గట్టు: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గట్టు ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న రాజుసాగర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో సన్మానించారు. విశ్వగురు వరల్డ్ రికార్డు (హైదరాబాదు) సంస్థ విశ్వగురు అవార్డులను బహూకరిస్తోంది. గట్టు మండలంలో గ్రామ స్వరాజ్యం కమ్యూనిటీ ఆర్గనైజేషన్ సంస్థ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గుర్తింపుగా గ్రామ స్వరాజ్యం సంస్థ అధ్యక్షుడు రాజుసాగర్‌కు హైదరాబాద్‌లో సద్గురు పురస్కార్ అవార్డును విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ చైర్మన్ సత్యవోలు రాంబాబు అందజేశారు. కార్యక్రమంలో నడిగడ్డ సోషల్ ఫోరమ్ అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కొండాపురం ప్రతాప్ పాల్గొన్నారు.

ఘనంగా మద్దేలేశ్వరి బండారు ఉత్సవం



అమరచింత: పద్మశాలీల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మద్దేలేశ్వరి మాత బండారు ఉత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. సోమవారం మధ్యాహ్నం మొదటి బోనాన్ని అమ్మవారికి సమర్పిస్తామని ఆ సంఘం నూతన అధ్యక్షుడు మహంకాళీ విష్ణు తెలిపారు. మంగళవారం రెండో బోనంతో మద్దేలేశ్వరి మాత జాతర ఉత్సవాలు ముగుస్తాయన్నారు. శ్రావణ మాసం ముగింపు రోజుల్లో ప్రతి సంవత్సరం మద్దేలేశ్వరి జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు దేవరకొండ లచ్చన్న, ప్రధాన కార్యదర్శి మహంకాళి ప్రభాకర్, పారుపల్లి సత్యన్న, ఎంకంపల్లి శ్రీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలో విద్యార్థి ప్రతిభ



పెబ్బేరు: కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో జిమ్మీ జియార్గి స్పోర్ట్స్ హబ్బో ఆధ్వర్యంలో జరిగిన రెండో సౌత్ ఇండియా కరాటే ఫెడరేషన్ చాంపియన్‌షిప్ పోటీలో ఆదివారం పెబ్బేరు విద్యార్థి చందన ప్రతిభ కనబర్చారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో నిర్వహించిన ఈ పోటీలో బాలికల విభాగంలో పాల్గొన్న చందన బ్రౌన్స్ మెడల్ సాధించిందని సుమన్ షోటోఖాన్ అకాడమీ మాస్టర్ శ్రీనివాసులు తెలిపారు. గెలుపొందిన విద్యార్థిని తెలంగాణ కియో రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, రామస్వామి, అబ్దుల్‌నబీ ప్రత్యేకంగా అభినందించారు.



రాయిచూరు రహదారిలో జాంపల్లి గ్రామం వద్ద ఇలా...

వామ్మో.. గుంతలు జర భద్రం!

ధరూరు: గద్వాల–రాయిచూరు ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని జాంపల్లి సమీపంలోని నెట్టెంపాడు ప్రధాన కాలువ రోడ్ కం బ్రిడ్జి వద్ద మోకాలి లోతు గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీళ్లు నిలవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ గుంత ఉందో తెలియక కార్ల వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ధరూరులో రోడ్డుపై గుంతలు

పాఠశాలల్లో దుర్వాసన

- మురుగునీటిలో ఆవరణలు
- దోమల వ్యాప్తి.. అంటువ్యాధుల భయం
- విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు



అయిజలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎదుట నిలిచిన మురుగునీరు

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల ఆవరణల్లో నిలిచిన మురుగునీరు వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు దుర్వాసన భరించలేకపోతున్నారు. ప్రాథమిక పాఠశాలల చిన్నారులు మురుగునీటిలో నడువలేక పాఠశాలలకు వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పాఠశాల ఆవరణాల్లో నీరునిలవడంతో ఆ ప్రదేశాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. నీళ్లు ఇంకిన తర్వాత బురద ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అందులో నడువలేక పోతున్నారు.

మౌలిక వసతులేవి..

అయిజ మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మొత్తం 55 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో 29 ప్రాథమిక, 16 ప్రాథమికోన్నత, 10 ఉన్నత పాఠశాలలున్నాయి. ఉర్దూ మీడియం పాఠశాల ఉంది. 6 నుంచి ఇంటర్ వరకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉంది. వీటిలో అనేక పాఠశాలలకు మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మురుగునీటి పాఠశాలలు..

మున్సిపాలిటీలోని బాలికల ప్రాథమిక పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలు మురుగు నీటిమధ్యలో ఉన్నాయి. వర్షం పడిన ప్రతిసారి పాఠశాలల చుట్టూ మురుగునీరు నిలుస్తోంది. మండలంలోని ఈడుగోనిపల్లి, కుటుకనూరు, సింధనూరు, తొత్తినోనిదొడ్డి, బింగుదొడ్డి, వేణిసోంపురం పాఠశాలల ముందు వర్షం నీరు నిలిచి మురుగు ఏర్పడుతోంది. పాఠశాలల పరిసర ప్రాంతాల పల్లపు ప్రదేశాలను మట్టితో నింపి, పాఠశాల ప్రాంగణంలో సీసీబెడ్ వేయాలని ఎన్నో ఏళ్లగా విద్యాశాఖ అధికారులకు, పాలకులకు విన్నవించినా స్పందించడం లేదు.

మురుగును తొలగిస్తే బాగుంటది..



ప్రభుత్వ పాఠశాలల వద్ద వర్షం నీరు నిలిచి మురుగు ఏర్పడి దుర్వాసన వస్తోంది. మురుగులో నడిచి పాఠశాల గదుల్లోకి వెళ్తే గదులన్నీ బురద మయం అవుతున్నాయి. అనేక పాఠశాలల్లో బెంచీలు లేవు. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలల వద్ద మురుగులేకుండా చర్యలు తీసుకోవాలి.

– త్రిశ, 8వ తరగతి, కేజీబీవీ

చర్యలు చేపట్టాలి..



ప్రభుత్వ పాఠశాలల్లో వర్షం నీరు నిలిచి మురుగు ఏర్పడడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల ముందు మురుగునీరు నిలిచిపోకుండా మట్టితో పాఠశాల ప్రాంగణం ఎత్తు పెంచాలి. సీసీ బెడ్లు ఏర్పాటు చేయాలి. పాఠశాల చుట్టుపక్కల ప్రదేశాల్లో మురుగునీరు నిలువకుండా చర్యలు చేపట్టాలి.

– మహబూబ్ బాషా, అయిజ

వ్యాధులు వ్యాపిస్తాయి..



పాఠశాలల ముందు మురుగు ఏర్పడడంతో దోమల ఉధృతి పెరిగి విద్యార్థులు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలి. మురుగునీరు, బురుద ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. పాఠశాలల ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలి. వీలైతే పాఠశాలల చుట్టూ గులుకరాళ్ల మట్టిని నింపాలి. అవసరమైన ప్రదేశాల్లో సీసీ బెడ్ ఏర్పాటు చేయాలి.

– భీమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, అయిజ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. పాఠశాలల ముందు మురుగు నీరు నిలుస్తోందని, విద్యార్థులు, ఉపాధ్యాయులు సమస్యలకు గురవుతున్నట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులకు చెప్పాం. 'మన ఊరు–మన బడి'లో ఇప్పటికే కొన్ని పాఠశాలల ముందు గుంతలను పూడ్చి పారిశుద్ధ్యం పనులు చేపట్టాం.

– నరసిరసింహ, ఇన్‌చార్జ్ ఎంఈఓ

అభివృద్ధియే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

మల్దకల్: బడుగు బలహీన వర్గాల అభివృద్ధియే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చర్ల గార్లపాడు, నీలిపల్లి, ఎద్దులగూడెం, కుర్తిరావల్‌చెర్వు, తాటికుంట గ్రామాల్లో ఇంటింటికి పిడికెడు మట్టి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, గోపాల్, కృష్ణారెడ్డి, బుడ్డన్న, ప్రకాష్, లక్ష్మయ్య, నాగరాజు, వెంకటేష్, మహేష్, తిరుపతిరెడ్డి, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, నర్సింహులు పాల్గొన్నారు.



కుర్తిరావల్‌చెర్వులో మట్టి సేకరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి

గద్వాల అర్బన్: మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేసి, ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్లుగా తెలంగాణలో కూడా రూ.21వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రథశాల వద్ద మున్సిపల్ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశలవారీగా ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, శివ, పాండు, రవి, మహేష్, మౌల, సత్యమ్మ, పద్మ ఉన్నారు.

నడిరోడ్డుపై గుంతలు పట్టించుకోరా?

మల్దకల్: అయిజ–గద్వాల ప్రధాన రహదారిపై పెద్దపల్లి సమీపంలో రైతులు పైపులైన్ కోసం రెండు చోట్ల రోడ్డుకు అడ్డంగా తవ్విన గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. వాటిని ఆర్‌అండ్ బీ అధికారులు, తవ్విన రైతులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే ఆ గుంతల్లో పడి ఎంతో మంది క్షతగాత్రులయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



పెద్దపల్లి సమీపంలో రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంత

విద్యార్థులకు ఘన సన్మానం

గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డికి చెందిన వైద్య విద్యార్థిని సరితారాణిని ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు వసంతకుమార్ కుమార్తె సరితారాణి ప్రభుత్వ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఆమెను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గట్టు మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న, సీనియర్ నాయకులు ఇమ్మానియేలు, అయిజ ఆంజనేయులు, జిల్లా కన్వీనర్ బండారి డేవిడ్, దేవేందర్, ఎంజీ నర్సింహులు, గొర్లఖాన్‌దొడ్డి నర్సింహులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో జగదీష్‌గౌడు కుమారుడు కార్తిక్ గౌడు ఎంబీబీఎస్ సీటు సాధించడంతో గౌడ సంఘ జిల్లా అధ్యక్షుడు పచ్చర్ల శ్రీధర్‌గౌడు ఆధ్వర్యంలో విద్యార్థిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్‌గౌడు, కోశాధికారి గోవర్ధన్‌గౌడు, నాయకులు వెంకటేశ్వర్లు గౌడు పాల్గొన్నారు.



గొర్లఖాన్‌దొడ్డిలో సరితారాణిని సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బట్లదిన్నె గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి–సావిత్రమ్మ దంపతుల కుమార్తె జాహ్నవి ఇటీవల నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభను కనబర్చింది. వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, కుటుంబ సభ్యులు విద్యార్థిని అభినందించారు.

తీర్పుపై ఉత్కంఠ

- జిల్లా వ్యాప్తంగా ఇదే చర్చ

గద్వాల క్రైం: ఏ నోట విన్న స్కిల్ స్కాంపై చర్చలు గత రెండు రోజులుగా జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా ఏపీ రాజకీయాలపై విశ్లేషణలు చేశారు. ఏపీ ప్రభుత్వం శనివారం ఉదయం నంద్యాల జిల్లాలోని మాజీ సీఎం (టీడీపీ అధినేత) నార చంద్రబాబు నాయుడును సీఐడీ అధికారులు అరెస్టు చేసి విజయవాడ ఏసీబీ కోర్టులో ఆదివారం ఉదయం 6గంటలకు హాజరుపరిచారు. న్యాయమూర్తి ఎదుట ఇరువర్గాల న్యాయవాదులు వాదనలు వినిపించారు. సాయంత్రం వరకు తీర్పును రిజార్వులో ఉంచారు. ఇక ఈ కేసులో ఎలాంటి తీర్పు వెలువడుతుందోనని జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు ఉత్కంఠగా ఎదురు చూశారు. మరో వైపు పలు వార్త చానళ్లలో ప్రసారమవుతున్న అప్‌డేట్స్‌ను తెలుసుకున్నారు. ఇక స్కిల్ స్కాంపై జరిగిన అవినీతి చంద్రబాబు హయాంలో జరిగిన అవినీతి, దోపిడీపై కథనాలు బేరీజు చేసుకున్నారు. సాయంత్రం 6:50 నిమిషాలకు ఏపీ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి చంద్రబాబు నాయుడికి 14 రోజుల రిమాండ్ విధించి రాజమండ్రి సెంట్రల్ జైల్‌కు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏపీ రాజకీయాలపై సర్వత్ర ఆరా తీశారు. మరో వైపు అక్కడి ప్రభుత్వం చేపట్టిన చర్యలకు జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాటర్ ఫిల్టర్ కేంద్రంలో చోరీ

ధరూరు: మండలంలోని వాటర్ ఫిల్టర్ కేంద్రంలో చోరీ జరిగింది. గద్వాల – రాయచూరు రహదారి పక్కన ఊరి చివర ఉన్న ఫిల్టర్ కేంద్రంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు షెడ్డు రేకులు కట్ చేసి అందులోకి ప్రవేశించారు. కౌంటర్‌లో ఉన్న కొంత నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడు వినోద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం గౌడ్ తెలిపారు.

మాలల ముఖ్య నాయకుల సమావేశం

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని ప్రకృతి నగర్ కాలనీలో మాలల ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. మాలల ఐక్యవేదిక ఏర్పాటు చేస్తామని కొర్విపాడు మాజీ ఎంపీటీసీ మునిస్వామి తెలిపారు. త్వరలో తేదీ, సమయం తెలుపుతామని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ మునిస్వామి, కంచుపాడు వెంకటేశ్వర్లు, తుమ్మల రవి, మునిస్వామి, పల్లె రాజు పాల్గొన్నారు.

అచ్చంపేటకు తరలిన బీఎస్పీ నాయకులు



ఎర్రవల్లి నుంచి తరలుతున్న బీఎస్పీ నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: బీఎస్పీ ఆధ్వర్యంలో అచ్చంపేటలో చేపట్టిన బహిరంగ సభకు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ ఎం.జీ. కృష్ణ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో వాహనాల ద్వారా కార్యకర్తలు తరలి వెళ్లారు. కార్యక్రమంలో నర్సింహులు, జైపాల్, మధుగౌడ్, రాజు, రవి, తిరుపాల్, ముని, సవరన్న ఉన్నారు.

బీఎస్పీ జెండా పండుగ..

ఉండవెల్లి: మండలంలోని శేరుపల్లెలో బీఎస్పీ జెండా పండుగ బీఎస్పీ మండల, నియోజకవర్గ నాయకులు నిర్వహించారు. ఆదివారం బహుజనుల గీతాన్ని బీఎస్పీ నాయకులు ఆలపించి మండల అధ్యక్షుడు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, శోభ గౌడు, నాగేంద్ర, రాజు, శివ శంకర్ గౌడు, మహేష్ పాల్గొన్నారు.

బీసీలకు 60 శాతం ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలి

గద్వాల అర్బన్: అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 60శాతం ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు అచ్చన్న గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన బీసీ సింహగర్జన సభకు జిల్లా నుంచి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76ఏళ్లు గడిచిన బీసీలకు సామాజిక న్యాయం, రాజకీయంగా సముచిత స్థానం కల్పించడం లేదన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వెంకట్‌రెడ్డి, వినోద్ కుమార్, వాల్మీకి, గోపాల్ రావు, ఉప్పేరు సుభాన్, రమేష్ గౌడ్ ఉన్నారు.

ఔషధ, సుగంధ ద్రవ్యాల మొక్కలపై అవగాహన



డీలర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ సురేష్‌కుమార్‌గౌడ్

గద్వాల వ్యవసాయం: శిలీంద్రాల వల్ల పంటలకు జరిగే నష్టం, ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలపై దేశీ శిక్షణ పొందుతున్న డీలర్లకు అవగాహన కల్పించారు. ఆదివారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ట్రైనర్ సురేష్‌కుమార్‌గౌడ్ డీలర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిలీంద్రాల ద్వారా పంటలకు జేరియస్ విల్ట్, కుళ్లు తెగులు ఆశిస్తాయని చెప్పారు. దీని నివారణ చర్యల్లో భాగంగా సాంప్రదాయ పద్ధతి, జీవ నియంత్రణ పద్ధతి, యాంత్రీకరణ పద్ధతి, రసాయనిక మందుల పద్ధతుల ద్వారా శిలీంద్రాలను నియంత్రించ వచ్చని వివరించారు. ఔషధ మొక్కలు–సుగంధ ద్రవ్యాలను వివరిస్తూ నేల వాము, అశ్వగంధ, తులసీ, కలబంధ, ఉసిరి, నేరేడు తదితర ఔషధ మొక్కలు, దవనము, లెమన్ గ్రాస్ తదితర సుగంధ ద్రవ్యాల మొక్కల వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని తెలిపారు. పొలం గెట్ల వెంట వీటిని వేయడం వల్ల పలు ఉపయోగాలుంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేశీ శిక్షణ డీలర్లు పాల్గొన్నారు.

మాయమాటలతో మభ్య పెడుతున్నారు

అలంపూర్: అగ్ర కులాల నాయకులు అనగారిన కులాలను మాయమాటలతో మభ్యపెట్టి మద్యం, డబ్బుకు బానిసలను చేస్తున్నారని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేష్ మహరాజ్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలో జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్, వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్, సీపీఎం, టీజేఎస్ పార్టీలకు నాయకత్వం వహించే వారు తెలంగాణ రాష్ట్రంలో 7 శాతం అగ్ర కులాల వారే ఉన్నారన్నారు. ధర్మ సమాజ్ పార్టీలో ధర్మ యుద్ధం కార్యక్రమాన్ని ఈ నెల 11న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల చేతిలో పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు లక్ష్మణ్, భాస్కర్, నాగరాజు, నరేష్, వేమన్న పాల్గొన్నారు.



అలంపూర్ చౌరస్తాలో మాట్లాడుతున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

మోటివేషనల్ స్పీకర్ రవీంద్ర ధీరకు అవార్డు



అవార్డు అందుకుంటున్న రవీంద్ర ధీర

అయిజ: సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఆదివారం నిర్వహించిన ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రోగ్రాంలో జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలానికి చెందిన కె.రవీంద్ర ధీర ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ చేతులమీదుగా రాష్ట్ర స్థాయి బెస్ట్ మోటివేషనల్ స్పీకర్, ట్రైనర్‌గా అవార్డు అందుకున్నారు. అత్యధికంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించి, సేవలు చేసినందుకు గంపా నాగేశ్వర రావు ఇంపాక్ట్ ఫౌండేషన్ నుంచి అవార్డుకు ఎంపిక చేశారు. ఈయన జోగుళాంబ గద్వాల జిల్లాతో పాటు తెలుగు రాష్ట్రాల్లో అనేక జిల్లాల్లో విద్యార్థులకు మోటివేషన్ తరగతులను నిర్వహించారు.

బహుజన జాగృతికి ప్రతీక చాకలి ఐలమ్మ



ధరూరులో ఐలమ్మ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు..

గద్వాల: తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు బహుజన జాగృతికి, మహిళాశక్తికి ప్రతీక అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ కొనియాడారు. ఆదివారం పాతబస్టాండ్ చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్రపటానికి డీకే అరుణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జయశ్రీ, రజకసంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలకేంద్రంలోని గాం. దీచౌక్‌లో ఆదివారం రజకసంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లుర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహ, బీఆర్ఎస్ నాయకులు దామోదర్‌రెడ్డి, హుస్సేన్, గొల్ల వెంకట్రాములు, తిక్కన్న, రమేష్ పాల్గొన్నారు.

కేటీదొడ్డి: పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని మండల అధ్యక్షుడు వెంకటేష్ కొనియాడారు. మండలంలోని కేటీదొడ్డి, కుచినెర్లలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉండవెల్లి: చాకలి ఐలమ్మ ఆశయాలను సాధించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్ అన్నారు. మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఏఎస్ఐ అయ్యన్న, సీపీఐ, సీపీఎం, సీఐటీయూ నాయకులు మద్దిలేటి, వెంకటేశ్వర్లు ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేత డీకే అరుణ

ధరూరు: రజక కమ్యూనిటీ హాల్ వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, వైఎస్సార్ చౌరస్తాలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్స్వామి ఆధ్వర్యంలో హమాలీ సంఘం నాయకులు చాకలి ఐలమ్మకు నివాళులర్పించారు.

శాంతినగర్: ఐలమ్మ వర్ధంతిని శాంతినగర్‌లో నిర్వహించారు. భూమి నాది పంట నాది మధ్యలో మీ పెత్తనం ఏంటని భూమి కోసం, భుక్తి కోసం, దోపిడీ పీడల నుంచి రైతాంగం విముక్తికోసం పాటు పడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.